క్లుప్తంగా

కాలువ పనులు చేపట్టాలని కలెక్టర్‌కు వినతి

మానకొండూర్: మండలంలోని నిజాయితీగూడెం గ్రామంలో 239 సర్వే నంబరులో కాలువ పనులు చేపట్టాలని గట్టుదుద్దెనపల్లికి చెందిన ఆకుల రాజేశ్వరరావు గురువారం కలెక్టర్‌కు విన్నవించారు. మిడ్‌మానేరు (ఎంఎంఆర్) డివిజన్2 లోని 11 ఆర్ మైనర్ ఆఫ్ 4 ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో చాలా మంది రైతులకు కాలువ నీరు అందక పంట పొలాలు దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో కాలువ నిర్మాణ పనుల అసంపూర్తిగా ఉండటంతో వర్షాలకు కాలువకు గండి పడి పంట పొలాల్లో ఇసుక మేట వేసిందని అధికారులు ఇసుకమేటలు తొలగిస్తామని చెప్పడమే తప్పా పట్టించుకోవడంలేదని వాపోయారు. తెగిన కట్టకు మరమ్మతు చేయించి పంట పొలాలకు నష్ట పరిహారం చెల్లించాలని అదే విధంగా కాలువ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేయించాలని కోరారు.

మట్టి తరలింపు ఆపేయాలని ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం ఇస్తున్న దేశరాజ్‌పల్లి గ్రామస్తులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ ఊరచెరువు నుంచి రైల్వే కాంట్రాక్టర్ అక్రమంగా మట్టి తరలిస్తున్నాడని, వెంటనే నిలిపివేయాలని దేశరాజ్‌పల్లి గ్రామస్తులు గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందజేశారు. మట్టి తరలింపుతో ఉపాధి హామీ కూలీలకు పని లేకుండా పోతుందని దీనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ పర్యవేక్షకుడిగా రమేశ్


చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోల రమేశ్ ప్రైమ్‌మినిస్టర్ స్కూల్స్ ఆఫ్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లా వనరుల అభివృద్ధి పర్యవేక్షకుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు 33 జిల్లాల నుంచి జిల్లాకు ఒక ప్రధానోపాధ్యాయుడిని ఎంపిక చేసి ఇటీవల హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 855 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని ప్రభుత్వం అమలు చేయనుందని, వచ్చే ఐదేళ్లలో ఎంపిక చేసిన ఒక్కో స్కూల్‌కు రూ. రెండు కోట్ల చొప్పున నిధులు కేటాయించి నూతన విద్యా విధానానికి కావాల్సిన వనరులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా నుంచి 12 పాఠశాలలు ఎంపిక చేశారని, అందులో ఏడు మోడల్ స్కూల్స్, ఐదు జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉన్నాయన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న నర్సయ్య

శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామంలో గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పేద ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు గోధుమపిండి, బ్రౌన్ బియ్యం, పెసర పప్పు, సబ్బులు అందజేశామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుష్మ, సరోజన, నర్సయ్య, శోభ, స్వప్న, అంజలి తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన



హుజూరాబాద్: వంట గ్యాస్ వినియోగదారుల ప్రాథమిక భద్రతలో భాగంగా ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డెలివరీ సిబ్బంది ఇంటింటిని సందర్శిస్తారని, ఇండేన్ గ్యాస్ పనితీరును గమనించి తొమ్మి అంశాలతో కూడిన ప్రశ్నావళిని ద్వారా ఆయిల్ కంపెనీకి అనుసంధానం చేస్తారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీలర్ల మాజీ ప్రధాన కార్యదర్శి పి.వి.మదన్ మోహన్ తెలిపారు. గురువారం పలువురికి అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీ గుర్తిస్తే 1906 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని, ఏ కంపెనీ గ్యాస్ వాడుతున్నామో ఆ కంపెనీకి చెందిన సిలిండర్, రెగ్యులేటర్ వాడే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే ప్రమాద బీమా వర్తించదన్నారు. కస్టమర్ల భద్రతా చర్యల్లో భాగంగా ఆయిల్ కంపెనీలు అందిస్తున్న సహకారాన్ని స్వాగతించాలని విజ్ఞప్తి చేశారు. వెంట ఇండియన్ గ్యాస్ మేనేజర్ ఈదులకంటి దేవేందర్‌రెడ్డి ఇతర సిబ్బంది ఉన్నారు.

‘చిల్లర’ చిక్కులు..!

- పది రూపాయల నుంచి వంద రూపాయల నోట్ల వరకు ఫుల్ డిమాండ్
- వ్యాపారులు, వినియోగదారులు జల్లెడ పడుతున్నా దొరకని వైనం
- రూ.రెండువేల నోట్ల రద్దుతో తారస్థాయికి కష్టాలు


హుజూరాబాద్‌లో పాల విక్రయ కేంద్రం యజమాని నుంచి చిల్లర నోట్లను తీసుకుంటున్న చిరువ్యాపారి

హుజూరాబాద్‌రూరల్: ఫోన్ పే, గూగుల్ పే వంటి నగదు రహిత లావాదేవీ సర్వీసులు వచ్చిన ప్రజలకు కరెన్సీ కష్టాలు తప్పటం లేదు. చిరువ్యాపారాలు చిల్లర లభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించే ముందు చిల్లర ఉందా లేదా అని తెలుసుకున్న తర్వాతే పనులు మొదలు పెడుతున్నారు. మరోవైపు చిల్లర కోసం వ్యాపారులు జల్లడ పడుతున్నారు. రూ.రెండువేల నోట్ల రద్దుతో చిల్లర కష్టాలు తారస్థాయికి చేరగా పది రూపాయల నోటు నుంచి వంద రూపాయల నోటు వరకు ఫుల్ డిమాండ్ ఉంది. చిరువ్యాపారాలకు పది నుంచి వంద రూపాయల నోట్ల వరకు చిల్లర అవసరం. రూ.10, 20, 50, 100 నోట్ల బెండిల్స్ కోసం వ్యాపారులు చక్కర్లు కొడుతున్నారు. బ్యాంకులకు వెళ్దామంటే ఉదయం పది గంటల తర్వాత తెరుచుకుంటాయి. దీంతో చిల్లర కోసం ప్రత్యామ్నాయ మార్గలపై దృష్టి పెడుతున్నారు. వినియోగదారులు రూ.500, రూ. 200 నోట్లతో కొనుగోలు జరిపేందుకు వస్తుండగా షాపుల్లో కొనుగోలు చేసే వస్తువులకు సరిపడా చిల్లర ఇచ్చే తీసుకోగలరంటూ హెచ్చరిక బోర్డులను పెడుతున్నారు. వ్యాపార కార్యకలాపాలు ముగిసిన తర్వాత సాయంత్రం నుంచి రాత్రి వరకు చిల్లర కోసం అన్వేషణ చేపడుతున్నారు. ఆర్టీసీ కండక్టర్లు ఇద్దరు, ముగ్గురికి కలిపి నగదు జోడి చేస్తుండటంతో నానా అవస్థలు పడుతున్నారు. కొందరు చిల్లరను అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. ఇటీవల ముగిసిన మేడారం మహా జాతరకు రెండు నెలల ముందు నుంచి జాతరలో చిన్నపిల్లల ఎత్తు బంగారం కోసం భక్తులు చిల్లర నోట్లు, నాణెలను సేకరించి హుండీలో వేయడం, వేసవిలో తిరుపతి దర్శనానికి వెళ్లే భక్తులు సైతం చిల్లరను తరలిస్తున్నారు.

ఇబ్బంది అవుతోంది



ఉదయం హోటల్ ప్రారంభించే ముందు చిల్లర కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రూ.30 టిఫిన్‌కు కస్టమర్లు రూ.500 నోట్లను ఇస్తే చిల్లర ఇవ్వడానికి కష్టం అవుతోంది. హోటల్ నిర్వహణ పూర్తయిన తర్వాత సాయంత్రం వేళ ప్రత్యేకంగా సమయంలో చిల్లర కోసం అన్వేషణ చేస్తున్నా.

– బండ మనోజ, హోటల్ షాపు యజమాని, హుజూరాబాద్

ముందస్తు బుకింగ్



పాలను ప్రతి కిరాణం షాపులో ఉదయం, రాత్రి వేళ వేస్తున్న సమయంలో కిరాణషాపుల నుంచి వచ్చే చిల్లర నోట్ల కోసం చిరువ్యాపారులు ముందుస్తుగా ఫోన్ చేసి బుకింగ్ చేసుకుంటున్నారు. రూ.5 వేల నుంచి మొదలుకొని రూ.10 వేల వరకు చిల్లర నోట్లను తీసుకెళ్తున్నారు.

– సాంబయ్య, పాలవిక్రయ కేంద్రం యజమాని, హుజూరాబాద్

రోజురోజుకూ డిమాండ్



బ్యాంకుల్లో రూ.పది నుంచి వంద రూపాయల నోటు వరకు చిల్లర లభిస్తోంది. బ్యాంక్ వేళల్లో వ్యాపారులు చిల్లర నోట్లు తీసుకొవచ్చు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. చిల్లర నోట్లకు రోజురోజుకూ డిమాండ్ పెరిగిపోతుంది. ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్స్ ద్వారా క్రయవిక్రయాలు జరిపితే శ్రేయస్కరం.

– కె.అభినవ్, ఎస్‌బీఐ మేనేజర్, చెల్పూర్

ఘనంగా బుద్ధ జయంతి


బుద్ధుని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


సరస్వతి అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

చొప్పదండి: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం బుద్ధ జయంతి ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కడారా గంగరాజు, కల్లెపెల్లి అరవింద్, కొత్తూరి మహేశ్, గొలిపెల్లి మోహన్, గాధం రాజమల్లయ్య, సముద్రాల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం పల్లకి సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సాయి మహిళా సేవా సమతి సభ్యులు సాయి చాలీసా పారాయణం చేశారు.

నాణ్యత విషయంలో రాజీపడొద్దు


దుస్తుల తయారీని పరిశీలిస్తున్న స్వరూపరాణి

చొప్పదండి: అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ నాణ్యతగా ఉండాలని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వరూపరాణి అన్నారు. దుస్తుల తయారీ ప్రక్రియను గురువారం చొప్పదండిలో పరిశీలించారు. మెప్మా సభ్యులు యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియ చేపట్టగా తయారీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ నాగరాజుతో కలిసి సందర్శించి తయారీదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు దుస్తులు రూపొందించాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని కోరారు. ఫార్మట్‌లో ఇచ్చిన డిజైన్‌లో దుస్తులు ఉండాలన్నారు. అనంతరం పురపాలక సంఘ ఆవరణలో మెప్మా ఆర్పీలతో సమావేశమై కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలి


వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ కృష్ణారెడ్డి

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచి రైతులకు, గృహ విద్యుత్ వినియోగదారులకు ఊరట కలిగించాలని ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఓవర్ లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ఇండ్లల్లో తరుచూ గృహోపకరణాలు కాలిపోతున్నాయని వాపోయారు. వ్యవసాయ విద్యుత్ వాడకంలో అదనపులోడుతో రైతులు నష్టపోతున్నారని స్థానిక ట్రాన్స్‌కో అధికారులు లోడ్ పెంచడంపై అశ్రద్ధ చేస్తున్నారని ఆరోపించారు. చొప్పదండి మండలంలో నాలుగు చోట్ల టూఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ప్రయోగం చేసిన అధికారులు వాటిని మార్చడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఫిర్యాదులో వాపోయారు. ఈమేరకు విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆర్నకొండ ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారని కృష్ణారెడ్డి తెలిపారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ


ప్రశంసా పత్రాలందజేస్తున్న హెచ్ఎం, తదితరులు

హుజూరాబాద్: అమెరికన్-ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో ఏప్రిల్ 23న ప్రారంభమైన ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గూడెపు స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్, గణితం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌తో పాటు స్కాచ్ కోడింగ్ (యానిమేషన్)కు సంబంధించిన వివిధ విషయాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు స్వప్న తెలిపారు. జిల్లా పరిషత్(బాలికల) ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.తిరుమల అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తాము నేర్చుకున్న నైపుణ్యాభివృద్ధి అంశాలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించగా ఆకట్టుకున్నాయి. హెచ్ఎం తిరుమల మాట్లాడుతూ... విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శృతి, జస్టి అలెక్స్, మహేందర్, మహేశ్, టీచర్ ఆసియా, వ్యాయామ ఉపాధ్యాయులు సొల్లు సారయ్య, ఇంగ్లిష్ టీచర్ కొండ సత్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం


రామడుగు: కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సత్యం


చొప్పదండి: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


చిగురుమామిడి మండలం సుందరగిరిలో..


గంగాధర: ఆలయం వద్ద బోనాలతో మహిళలు


మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి


తిమ్మపూర్: హనుమాన్ స్వాములకు అన్నదానం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించగా ఆలయ ఈఓ రాజ్‌కుమార్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గందె సంపత్‌కుమార్ పట్టువస్త్రాలు, ముత్యాల లంబ్రాలు బహుకరించారు. ఆలయ అర్చకులు శేషం సత్యనారాయణాచార్యులు, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, జూనియర్ అసిస్టెంట్ కవిత, పాలకవర్గ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని మోతె గ్రామం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరుకాగా వేదపండితులు ఆశీర్వచనాలను అందజేశారు. కార్యక్రమంలో అల్గీ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుల అంజనీప్రసాద్, ఎంపీపీ జవ్వాజీ హరీశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు, పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నేదునూరు గ్రామంలోని శ్రీరంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కల్యాణోత్సవాన్ని తిరుక్కోవెల సాయినాథ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిపించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ ఒంటెల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, ఎడమ శ్రీరంగారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో గురువారం శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికలో కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు, గ్రామ ప్రముఖులు, మహిళల భక్తులు పాల్గొన్నారు.

శకటోత్సవం

శంకరపట్నం: మండలంలోని ముత్తారంలో సీతారాములస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గుట్ట చుట్టూ శకటోత్సవం నిర్వహించారు. ఎరడపల్లి, ముత్తారం, కన్నాపూర్, ధర్మారం, కేశవపట్నం గ్రామాల నుంచి భక్తులు ఎడ్ల బండ్లతో తరలివచ్చి గుట్ట చుట్టూ తిప్పారు. ఆలయ ఆవరణలో అర్చకులు రాఘవాచార్యులు, బాలాజీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో గురువారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల జాతరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి మొక్కులు

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పీఆర్టీయూ, పీఎంటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగపురి తిరుపతిగౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గాయత్రి హోమం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ఆశ్రమంలో గురువారం వేదపండితులు గాయత్రి హోమం నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని తనుజు ఓంకారం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపించారు.

హనుమాన్ స్వాములకు భిక్ష

తిమ్మాపూర్: నుస్తులాపూర్‌లో మాజీ సర్పంచ్ రావుల రమేశ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల అంజన్న స్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏటా స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని రమేశ్ అన్నారు. కూతురు అక్షిత జన్మదినం పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, నూనె సురేశ్, సత్యం, నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

హనుమాన్ భక్తులకు విరాళం

వీణవంక: మండల కేంద్రంలోని హనుమాన్ మాలధరణ భక్తులకు ట్యూరిటో, యుప్‌టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి విరాళం ప్రకటించారు. శోభాయాత్ర నిర్వహించేందుకు ఉదయానందన్‌రెడ్డిని సంప్రదించగా రూ.10,016 అనుచరుల ద్వారా భక్తులకు అందించారు. మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, అమృత ప్రభాకర్, కుమారస్వామి, శ్రీదర్, రాకేశ్, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి ఉన్నత పాఠశాల 1999–2000 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డికి పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలి

సైదాపూర్: దశాబ్ద కాలంగా అమలుకు నోచుకోని జర్నలిస్టుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మండల అధ్యక్షుడు బండారి గట్టయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. మండలంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకూరలేదని, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన జర్నలిస్టులకు రాష్ట్రం సిద్ధించిన తర్వాత కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పత్తెం చిన్న రమేశ్, కో కన్వీనర్‌గా గాదె రఘునాథరెడ్డి, సభ్యులుగా బొలుమల్ల రాజమౌళి, శేషం నర్సింహాచార్యులు, జేరిపోతుల సదానందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కన్వీనర్ రమేశ్ తెలిపారు. పాత్రికేయులు కనకయ్య, అశోక్, సాయిచరణ్, రంజిత్‌కుమార్, శ్రీనివాస్, భరత్, అజయ్, అనిల్ కుమార్ సీనియర్ పాత్రికేయులు పాల్గొని అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

సైదాపూర్ మండల కేంద్రం నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకోగా డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. గురువారం తెల్లవారు జామున ఎస్సై పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో టాటా ఏస్ వాహనాన్ని వదిలి వెళ్లగా తనిఖీ చేశామని, 26 క్వింటాళ్ల రేషన్ లభించగా వెహికిల్ నంబర్ ఆధారంగా వల్లెపు అనిల్ అనే వ్యక్తి చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన పెద్దబత్తుల కుమార్ నుంచి రేషన్ బియ్యాన్ని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని, ఇ ద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

రహదారి మరమ్మతుకు రూ. 6 కోట్లు మంజూరు

- తీరనున్న రెండు మండలాల ప్రజల ఇబ్బందులు
- రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట నుంచి తిర్మలాపూర్ ద్వారా గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామం వరకు వెళ్లే రహదారి మరమ్మతులకు ప్రభుత్వం రూ. 6 కోట్లు మంజూరు చేసిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. తిర్మలాపూర్ వద్ద రహదారిని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ.. రహదారి పూర్తిగా గుంతలమయంగా తయారుకావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. గంగాధర, రామడుగు రెండు మండలాల ప్రజలకు ఇబ్బందులు తీరుతాయని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ జవ్వాజీ హరీశ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొమ్మరవేని తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, నాయకులు కోల రమేశ్, హన్మంతు, కట్ల శంకర్, లక్ష్మన్, నర్సయ్య పలువురు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేజన్ల తర్వాతే ఎన్నికలు

గన్నేరువరం: బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని ఖాసీంపేటలో మాట్లాడారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించమని, జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ల కల్పించాలన్నారు. 52 శాతం ఉన్న బీసీలు ఒక్కటై ప్రభుత్వాన్ని నిలదీయడానికి వెనకాడబోమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లపై స్పష్టత తేల్చినాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు.